క్లుప్తంగా

యనమలకుదురు దేవస్థానంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఉదయం స్వామివారికి ఏకరుద్రాభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ సొమ్ము మంజూరు చేసి విడుదల చేసింది. మొత్తం పింఛన్‌దారులు 17,713 మంది ఉండగా వారికి ప్రభుత్వం రూ.4,93,99,750 సొమ్ము మంజూరు చేసి సోమవారం విడుదల చేసింది. ఇందులో తాడిగడప మున్సిపాలిటీలో 19వ వార్డు సచివాలయాల్లో 12,237 మందికి రూ.3,42,02,750, పెనమలూరు మండలంలో 11 గ్రామ సచివాలయాల్లో 5494 మందికి 1,51,97,000 సొమ్ము విడుదల చేసింది. పింఛన్‌దారులకు మంగళవారం పింఛన్‌లు పంపిణీ చేస్తారు.

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్ ప్రారంభం



గన్నవరం రూరల్: మండల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలకు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ సోమవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్‌లో పోటీలు నిర్వహిస్తామని, వీటిలో గెలిచిన వారికి నియోజక వర్గ స్థాయిలో నగదు పారితోషికం అందజేస్తారన్నారు. ఆసక్తి ఉండి 17ఏళ్లు నిండిన యువతీ, యువకులు సచివాలయం కార్యదర్శుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఒక్కొక్కరు రెండు క్రీడల్లో మాత్రమే పాల్గొనాలని చెప్పారు. వివరాలకు మండల క్రీడల అభివృద్ధి అధికారి డి.నాగరాజు 94907 98909 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భర్తపై వరకట్నం వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఉమాశంకర్‌నగర్‌కు చెందిన పత్రి అనూష 2013 వ సంవత్సరంలో తాపీపని చేసే రాంబాబును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భర్త అదనపుకట్నం తీసుకురమ్మని వేధించటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందిన ఫిర్యాదుతో పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని కరెంట్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని చిన్మయి ధ్యానమందిరం ప్రాంతం, వాటర్ ట్యాంక్ ఏరియా, పట్టిలవారి వీధి, ఎస్‌బీఐ ఏరియా, రంగా బొమ్మ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం



కంకిపాడు: ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరమని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో కేవీ నందకిషోర్, కనకదుర్గ సహకారంతో సోమవారం ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీబీకే సుధారాణి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేఎస్ మల్లేశ్వరరావు, కోశాధికారి వి.శివరామకృష్ణ, ప్రతినిధులు మద్దుల గోవిందరావు, వై.గంగాధర్ రావు, కె.భారతి, ఎం.పార్వతీశ్వరరావు, కోనేరు స్వరూపారాణి, కోనేరు ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టించుకోకపోతే సహించం

- మంతెన, దావులూరులో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటన
- ముంపు ప్రాంతాల సందర్శన
- ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో సమీక్ష



మంతెనలో శిథిలమైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకిపాడు: రైతాంగ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హెచ్చరించారు. మండలంలోని మంతెన, దావులూరు గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. మంతెనలో భారీ వర్షాలకు బుడమేరుపై శిథిలమైన బ్రిడ్జిని సందర్శించారు. బ్రిడ్జి అవతల సుమారు 1600 ఎకరాల్లో పంట పొలాలు సాగులో ఉన్నాయని, సాగుకు ఇబ్బందులు ఏర్పడతాయని, బ్రిడ్జిని మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తిచేశారు. వెంటనే ఆయన డ్రెయినేజీ విభాగం ఎస్‌ఈకి ఫోన్ చేసి రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా ఉంటే ఎలా అని, బ్రిడ్జి మరమ్మతులు, ముంపు సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువలు, పంట బోదెలు పూడుకుపోయి పంట పొలాలు ముంపులో ఉన్నాయన్నారు. ముంపు సమస్యను పరిష్కరించేందుకు పొక్లెయిన్‌లతో పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. బుడమేరు బ్రిడ్జి మరమ్మతులు, నూతన బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దావులూరు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్న ఇరిగేషన్, డ్రెయినేజీ బోదెల తవ్వకానికి తన వంతు సహకారం అందిస్తానని, అధికారులు దగ్గర ఉండి బోదెల పనులు పూర్తి చేయించాలన్నారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, పనితీరు మార్చుకుని రైతాంగ సంక్షేమానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్‌లు వీరంకి వెంకటరమణ, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, నాయకులు బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, కొండా రామిరెడ్డి, కొణతం గిరిధర్, కె.సీతారామయ్య, మసిముక్కు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దేవినేని రాజాకు పరామర్శ

మాజీ ఎంపీపీ దేవినేని రాజా తండ్రి బాలగంగాధర్ రావు ఇటీవల మృతి చెందటంతో ఎమ్మెల్యే పార్థసారథి ఈడుపుగల్లు గ్రామంలోని రాజా నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలగంగాధర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా పని చేస్తున్నాం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వల్లభనేని నాని

ఉయ్యూరు: అభివృద్ధే లక్ష్యంగా ప్రజలు మెచ్చే విధంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అజెండాలోని అంశాలను కౌన్సిల్ ముందుంచారు. కౌన్సిలర్ గోన మదన్‌తో పాటు పలువురు సభ్యులు పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ప్రాధాన్యతాక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సభ్యులు చెప్పే సూచనలు పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి అజెండాగా పని చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ

- ఎమ్మెల్యే పార్థసారథి
- మంతెనలో 660 కుటుంబాలకు డస్ట్‌బిన్‌ల పంపిణీ



మంతెనలో డస్ట్‌బిన్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని మంతెన గ్రామ పంచాయతీ పరిధిలోని 660 కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన డస్ట్‌బిన్‌లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. స్థానిక రైల్వే గేటు ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ప్రభుత్వం వైద్యాన్ని గ్రామస్థాయికి తీసుకొచ్చిందన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఈఓ కూర్మారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా విజ్ఞానం, నైపుణ్యం పెంపు



గెలుపొందిన క్రీడాకారులతో కలెక్టర్ పి.రాజాబాబు చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు

కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం):క్రీడల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ క్యారమ్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు కప్‌లు, నగదు బహుమతుల ప్రదానం లక్ష్మీ టాకీసు సెంటరులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ ద్వారా ఎంతో నైపుణ్యం వస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఈ క్రీడను అలవాటు చేసుకుంటే ఉన్నతస్థాయిలో ఆడేందుకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. బందరు శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ రానురానూ కనుమరుగవుతున్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు మచిలీపట్నంలో నిర్వహించటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో జీవో నెంబరు 74 ద్వారా 13 క్రీడలను తొలగించబడ్డాయని వీటిలో క్యారమ్ కూడా ఒకటి ఉందన్నారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడి క్యారమ్‌క్రీడను రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలో కూడా నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. క్యారమ్ క్రీడ ద్వారా నైపుణ్యం పొందిన క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు వచ్చేలా తాను సీఎం జగన్‌తో చర్చిస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అనంతరం క్యారమ్స్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన పి.జనార్ధనరెడ్డి (వైజాగ్)కి కప్‌తో పాటు రూ. 10 వేలు నగదు, రన్నర్ స్థానంలో నిలిచిన ఎండీ సాధిక్ (గుంటూరు)కు కప్‌తో పాటు రూ. 8వేలు నగదు, మూడో స్థానంలో నిలిచిన వైఎస్‌డీ రమేష్ (వైజాగ్)కు కప్‌తో పాటు రూ. 6 వేలు నగదు, నాల్గవ స్థానంలో నిలిచిన బి.రవీంద్రరెడ్డి(గుంటూరు)కు కప్, రూ. 4 వేలు నగదు అందజేశారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ జలీల్, తహసీల్దార్ శ్రీవిద్య, జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, టోర్నమెంట్ ఉపాధ్యక్షుడు గౌర శ్రీహరి, ముచ్చర్ల వెంకటరత్నం పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగదు చెల్లింపుపై ఘర్షణ

ఉంగుటూరు: వైన్‌షాపు వద్ద ఫోన్‌పే చెల్లించే విషయంలో జరిగిన దాడిలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన నందమూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరు మండలం కలవపాముల దూబామాలపల్లికి చెందిన పాగోలు శ్రీకాంత్ తన స్నేహితుడు కాశ్ల నవీన్‌తో కలసి నందమూరు క్రాస్ రోడ్డులో వైన్ షాపునకు వెళ్లారు. డబ్బులు చెల్లించేందుకు శ్రీకాంత్ ఫోన్‌పే చేస్తుంటే ఫోన్‌పే కాలేదు. ఇంతలో ఫోన్‌పే పని చేయడం లేదని వైన్‌షాపులోని వ్యక్తి చెప్పాడు. నా ముందు నలుగురికి ఫోన్‌పే పనిచేసినపుడు నాకు ఎందుకు పనిచేయదని అడుగుతుండగా బయట ఉన్న పెనుమత్స రాజేష్, కూడేటి నాగమురళి, కోటయ్య శ్రీకాంత్‌తో ఘర్షణ పడ్డారు. ఘటనలో శ్రీకాంత్ నుదిటిపై గాయం కావడంతో ఉంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించండి

సబ్‌కలెక్టర్ అదితిసింగ్ ఆదేశం

విజయవాడరూరల్: నున్న గ్రామం కోటకట్ట(స్టేట్‌బ్యాంక్) సెంటర్లో ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో సోమవారం సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నున్న బ్యాంక్ సెంటర్లో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు ఇటీవల సర్వే చేసి తాత్కాలిక ఆక్రమణలను గుర్తించారు. వీటిని ఆగస్టు 20వ తేదీలోపు పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, ఆర్‌అండ్‌బీ డీఈ ఆర్.సత్యనారాయణ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

గన్నవరం రూరల్: వేధిస్తున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని గన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన కొలకలూరి మణిమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలిసిన వివరాల ప్రకారం స్థానికురాలు మణిమ్మకు తన తండ్రి తిరివీధి అర్జునరావు 1983లో ఇంటి స్థలం ఇచ్చాడు. ఆ స్థలంలో నిర్మించుకున్న ఇంటిలో భర్త, కుమారుడు, కోడలితో కలసి ఆమె నివసిస్తోంది. ఇంటికి పడమర వైపు స్థలంలో ఆగిరిపల్లికి చెందిన పాస్టర్.. పంచాయతీ అనుమతి లేకుండా ఇల్లు నిర్మించటంతో పాటు భారీ శబ్దాలతో డీజేలు పెడుతున్నారని, తమ స్థలంలో ప్రహరీ నిర్మిస్తూ వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటీవల పాస్టర్ వేధింపులు తాళలేక తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

19 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 19, 20 తేదీల్లో విజయవాడ నగరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం సమావేశాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గంగూరులో రూ.32 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు



గంగూరులో నిర్మాణంలో ఉన్న రోడ్డు

పెనమలూరు: గంగూరు గ్రామంలో రూ.32 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. గ్రామంలో 13వ వార్డులో రహదారి సక్రమంగా లేక పోవటంతో స్థానికులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆయన మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.14 లక్షలు కలిసి రూ.32 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆమోదించారు. దీంతో 500 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు చేపట్టారు.

కార్మికులకు భోజన వసతి

గ్రామంలో రహదారి నిర్మాణ పనుల్లో పని చేస్తున్న కార్మికులకు సోమవారం పాస్టర్ సురేష్ భోజన ఏర్పాట్లు చేశారు. కార్మికులు గ్రామస్తుల కోసం అందించిన సేవలకు గాను ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కార్యదర్శి జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

డీసీపీ విశాల్‌గున్నీ



కానూరులో ప్రసంగిస్తున్న డీసీపీ విశాల్‌గున్నీ

పెనమలూరు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విజయవాడ డీసీపీ జి.విశాల్ గున్నీ అన్నారు. కానూరులో సోమవారం స్పాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నాయకత్వ లక్షణాలపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, దీనికి ప్రధానంగా నాయకత్వ లక్షణాలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు, రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ వీరమాచినేని వంశీ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాట్లు అప్పగించనందుకు కేసు నమోదు

కంకిపాడు: నిర్ణీత గడువులోపు ప్లాట్లు అప్పగించకుండా మోసం చేయటంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి కథనం మేరకు...పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన మార్ని నారాయణమూర్తి 2013లో వేల్పూరు గ్రామంలోని శ్రీ సూర్యభవాని ఎస్టేట్స్ అండ్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్లాట్లు కొనుగోలు చేశారు. వెంచర్ అభివృద్ధి చేసి మూడేళ్లలో ప్లాట్లు అప్పగిస్తామని చెప్పారు. అయితే ఇప్పటివరకు ప్లాట్లను అప్పగించలేదు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

అదనపు కట్నం కావాలంటూ వేధింపులు

కంకిపాడు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతనికి సహకరిస్తున్న అత్త, మామలపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన కథనం మేరకు...మండలంలోని ఉప్పలూరు గ్రామం హనుమాన్‌పేటకు చెందిన తమ్మిశెట్టి లావణ్య, రవికుమార్ భార్యాభర్తలు. వీరికి 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. రవికుమార్ తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. కొద్ది రోజులుగా అదనపు కట్నం కావాలంటూ భార్య లావణ్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. అత్తమామలు కూడా అతనికి వంత పలుకుతున్నారు. దీనిపై లావణ్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మండల రవికుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఆర్టిఫిషియల్ క్రియేటివిటీ - విత్ చాట్ జీపీటీ' అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి వినియోగించే భాష, వివిధ ఫార్ములాలు తదితర అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. దీని వల్ల మానవ వనరుల వినియోగం తగ్గుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను విద్యార్థులకు తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, విభాగాధిపతి పి.రవీంద్ర, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్లపై ప్రమాదాలకు చెక్

- రూ.36 లక్షలతో ఐరన్ గ్రిల్స్ పనులు
- రామలింగేశ్వరనగర్‌లోని పలు వీధుల్లో ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు



వీఎంఆర్ రోడ్డులో అవుట్‌ఫాల్ డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్

ఆటోనగర్(విజయవాడతూర్పు): అవుట్‌ఫాల్ డ్రెయినేజీలపై ప్రమాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. అవుట్‌ఫాల్ మురుగు కాలువలో పడి గాయాల పాలవడం వంటి ఘటనలు రామలింగేశ్వరనగర్ పరిధిలో నిత్యకృత్యంగా జరిగేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు ప్రజలు కాళ్లు అరిగేలా తిరిగారు. అయినప్పటికీ సమస్యను పట్టించుకున్న పాపానపోలేదు. వృద్ధురాలు, చిన్నారులు డ్రెయినేజీ కాలువలో పడి తీవ్ర గాయాలపాలయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డ్రెయినేజీలపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపింది.

గత కొన్నేళ్లుగా సమస్య..

15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని వీఎంఆర్, రఘురోడ్డు, గాంధీనగర్, నీలవేణిరోడ్డు, సాయికట్ పిసెస్ రోడ్డు, ఎర్రపోతుల వారివీధి, చెల్లారావువీధి, గాంధీకాలనీ వరకు 400 కుటుంబాల వారు డ్రెయినేజీలపై రాకపోకలు సాగిస్తారు. నివాసాల మధ్య డ్రెయినేజీ ఉంది. గత కొంత కాలంగా ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రజలకు భద్రత కరువైంది. కనీసం కాలువలపై సిమెంట్ దిమ్మెలు వేయలేదు. దీంతో రాత్రి సమయాల్లో వృద్ధులు, చిన్నారులు కాలువల్లో పడి గాయాలు పాలయ్యారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు..

అవుట్‌ఫాల్ డ్రెయినేజీ కాలువపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తానని గత కార్పొరేషన్ ఎన్నికల్లో బెల్లం దుర్గ హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా ఆమె గెలుపొంది, ప్రస్తుతం డెప్యూటీ మేయర్‌గా ఉన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా సమస్యను పరిష్కరించారు. కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.36 లక్షలతో అవుట్‌ఫాల్ డ్రెయినేజీపై ఐరన్ గ్రిల్స్‌ను గత కొద్ది నెలల క్రితం ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

మా సమస్యను పరిష్కరించారు..



ఇళ్ల మధ్య ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయినేజీతో గత కొంత కాలంగా నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. డ్రెయిన్‌లో పడి గాయాల పాలైన ఘటనలో రోజూ జరుగుతుండేవి. వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులు వర్ణనాతీతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డెప్యూటీ మేయర్ దుర్గ స్పందించి నిధులు మంజూరు చేయించారు. దీంతో ప్రమాదాలకు చెక్ పడింది.

– ఎం.రమేష్, స్థానికుడు, రామలింగేశ్వరనగర్

రైల్వే ట్రాక్ దాటే సమయంలో జాగ్రత్తలు పాటించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రైల్వే ట్రాక్‌ను దాటే సమయంలో పాదచారులు చాలా జాగ్రత్తలు పాటించాలని జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పాదిగింటి నాగరాజు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీ- మధురానగర్ రూటులో రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగిస్తూ స్థానిక ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రైల్వే పోలీసులు, జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రవేశం లేని ప్రదేశాల్లో రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగించడం అంత మంచిది కాదని, వీటివల్ల ప్రాణాలకే ప్రమాదమని సూచించారు. వాల్‌పోస్టర్ల సాయంతో రైలు ప్రమాదాలు ఏ విధంగా చోటుచేసుకుంటాయి, వాటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లామని, సాధ్యమైనంత త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైల్వే ఏఎస్‌ఐ గురవయ్య, జనంలో మనం సేవా సంస్థ సభ్యులు, ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

1100 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రజాప్రతినిధులు తెలిపారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో సోమవారం జగనన్న సురక్ష నిర్వహించారు. శిబిరంలో 1100 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, ఇన్‌కం సర్టిఫికెట్లు, కొత్త రైస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ, ఎంపీటీసీ సభ్యుడు పరిమి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ముంపు బెడద తొలగించండి

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురంలోని పంటపొలాల్లో ఉన్న వర్షం నీటిని బుడమేరు కాల్వలో కలపడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు సర్పంచి గండికోట సీతయ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన రైతులు సోమవారం ముంపులోని వరిదుబ్బులను తీసుకొచ్చి, వరి పొలాలు పూర్తిగా ముంపులో వున్నాయని తెలిపారు. మిషన్ ఏర్పాటు చేసి పూడిక తీయిస్తానని సర్పంచి రైతులకు హామీ ఇచ్చారు. రైతులు నాగిరెడ్డి, కుందేటి శ్రీనివాసరావు, చిన్న మిషేక్, చిలువురి రాజు, గొడ్డళ్ల సత్యనారాయణ, నందిపాముల ఏసుపాదం తదితరులు సర్పంచిని కలిసిన వారిలో ఉన్నారు.